# "శాంతి - మూర్తి"

రాజమండ్రిలో రైలు ఎక్కినప్పటి నుంచి ఆ కంపార్ట్‌మెంట్‌లో కూర్చున్న ఇద్దరు స్టూడెంట్స్ భారతి మీద చూపుల బాణాలు విసురుతూ ఏవో మాటలు అంటూనే ఉన్నారు.

"వైజయంతీమాలకి ట్విన్ లాగ ఉందిరా."

"పంజాబీ డ్రెస్ ఆ సౌష్టవానికి అందం తీసుకు వచ్చిందిరా."

"అది పంజాబీ డ్రెస్సా ?"

"పంజాబీయో, గుజరాతీయో ఈ మహాంధ్ర మధ్యంలో ఎవరికి తెలుసు ?"

"పరభాషా వేషాదులమీద ఈ నవనారీ లోకాని కంత మోజు తగదురా."

"ఏ వేషమైతే నేమిరా ముద్దువచ్చేట్టుంటే.."

భారతి ఆ సంభాషణ వినలేకుండా ఉంది. ఏమైనా సరే పక్క స్టేషన్‌లో దిగిపోయి వేరే కంపార్టుమెంటులోకి వెళ్ళాలని చూస్తుంటే ఏలూరు వచ్చింది. త్వరగా దిగింది భారతి. సాయంగా వస్తున్న వెంకటస్వామి వచ్చి "ఇక్కడ దిగారేమిటి అమ్మాయిగారూ" అని అడిగాడు.

"నా సూట్‌కేసు తీసుకురా. ఇంకొక పెట్టెలో ఎక్కుతాను" అంది.

"పైన ఇంకొక సెకండ్‌క్లాస్ ఉందమ్మా. మీరు పదండి" అన్నాడు.

భారతి ఏదో ఆలోచించుకుంటూ వెళ్ళి సెకండ్ క్లాస్ దగ్గిర ఆగింది. అప్పుడే కంపార్టుమెంట్‌లోకి ఒక యువకుడు, యువతి ఎక్కి సామాను సర్దు కుంటున్నారు.

"ఆ బేగ్ నీదగ్గర ఉంచుకో శాంతా" అన్నా డతడు నవ్వుతూ. అందంగా ఉన్నా డనుకుంది భారతి. ఎదురుగా ఉన్న బెర్త్‌మీద కూర్చుంది. భారతికి ఎదురుగా శాంత కూర్చుని ఉంది. వేషం నాగరికంగా ఉంది కాని అందులో ఒక హుందాతనం ఉంది. తెల్లని శరీరచ్ఛాయ. నుదుట ఎర్ర బొట్టు. ఒక చేతికి నాలుగు మిరియాల గాజులు, రెండవ చేతికి వాచ్ ఉంది. స్క్వేర్ నెక్ జాకెట్‌లో అందంగా రెండు వరసల గొలుసు కనిపిస్తోంది. నల్లని జరీ చీర. నొక్కుల జుట్టులో జారిపోతున్న గులాబీలు రెండు. కళ్ళలో మెరుపు లీనుతూ కాటుక. ఎంత ఇంపుగా ఉంది! భారతి బరువుగా ముఖం తిప్పుకుని కిటికీ బయటకు చూస్తూ కూర్చుంది.

"తను కూడా అట్లాగ ఉంటే ఎంత బాగుం డేది! ఈ బాధ ఉండేదికాదు. ఈ వేషంతో తల యెత్తి చూడటానికే సిగ్గుగా ఉంది. ఇదంతా అమ్మ చేసింది. నాన్నకి అసలు ఇటువంటివి ఇష్టం ఉండవు. నాన్న గనక కాంప్‌కి వెళ్ళకుండా ఉంటె తను ఈ వేషంతో ప్రయాణానికి తయారయ్యేది కాదు. ఆరోజు క్లబ్‌కి వెడితే నీ కీ వేషం చాలా అందాన్ని తెచ్చింది భారతీ అన్నారంతా. అమ్మకి

విజయ కుమారి



అప్పటినుంచి సరదా. వేసుకోమంటుంది. కేవలం అమ్మని అంటే ఏం లాభం ? సీత, రజని స్టేషన్‌కి వస్తామని రాశారు. వాళ్ళకి సర్‌ప్రైజ్ ఇవ్వాలని ఎంతో అనుకుని కదా తను ఈ దుస్తులు ధరించింది! మధ్యలో ఈ ప్రయాణ మంతా గడవాలని అందరూ తనను చూపులతో వేపుకు తింటారేమో నని తను ఆలోచిస్తే కదూ. ఆవిడ ఎంత ఫ్రీగా కూర్చుంది" అని తనలో అనుకుంటోంది భారతి.

"బెజవాడ వెళ్ళేటప్పటికి నాలు గవుతుంది కాబోలు" అంటూ శాంత గడియారం నుంచి తన చూపులు ప్లాట్‌ఫారం వైపు మళ్ళించింది. ఎదుట కూర్చున్న అమ్మాయి ఆమె చూపుల నరి కట్టింది. క్యూటెక్స్ వేసిన పొడుగు వ్రేళ్ళు కలిగి ఎర్రని గాజులతో ఉన్న తెల్లని ముంజేతికి పొడుగైన గడ్డాన్ని ఆనించి బయటకు చూస్తున్నది. రంగువేసిన ఎర్రని పెదవులు! చిత్రకారుడు దిద్దినట్లు చెంపలవైపు పోతున్న ముంగురులు. కనుకొలకులను దాటి దిద్దుకున్న కాటుక. ఎక్కడో చూచిన పోలిక. అదేమిటో పంజాబీ పిల్ల..... ఔను, వైజయంతీమాలలాగ ఉంది. అంత పోలిక ఉండటం ఆశ్చర్యం కాదూ! తలయెత్తి మూర్తివైపు చూసింది శాంత. అప్పటికే అతడు పంజాబీ దుస్తులు ధరించిన యువతిని పరికించటంలో తత్పరుడై ఉన్నాడు కవుల వర్ణన ప్రకారం ఆ క్షణంలో శాంత కపోలాలు ఎర్రబడ్డాయని చెప్పాలి. కాని వెంటనే ఆమెకి నవ్వు వచ్చింది. ఔను. అది సహజమే.

అతను శాంతవైపు తిరిగి "పంజాబీయా ?" అన్నాడు హేళనగా.

"నాకేం తెలుసు" అంది ముభావంగా.

సమంగా ఆ సమయానికే వెంకటసామి సూట్ కేసుతో వచ్చాడు.

"నేను ప్రక్కనే ఎక్కుతానండీ అమ్మాయి గారు" అన్నాడు.

"సరే, నువ్వు వెళ్ళు" అంది భారతి సూట్ కేసు అందుకుంటూ.

"తెలుగేనా? మరి ఆ వేష మెందుకు?" అన్నాడు మూర్తి శాంత చెవి దగ్గరగా.

ఎదుట కూర్చున్న మనిషిని గురించి గుస గుసలు ఏం మర్యాదగా ఉంటుంది! మూర్తి చదువు కోనివాడేమీ కాదు. అతని ప్రవర్తన అసహ్యంగా తోచి చిరాకుగా

"ఏమో నాకేం తెలుసు! నాతో ఆ సంగతు లేమీ అనొద్దు" అంది.

ఊహూ, అతను వూరుకోలేదు. ఆ అమ్మాయిని చూస్తూ రిమార్కులు పాస్ చేస్తూనే ఉన్నాడు.

"హిందీలో మాట్లాడితే తగినట్లుండేదిగా.... ఆ చేతిలో పత్రిక ఏమిటో అడుగు చూద్దాం."

ఏమిటో ఆ కుతూహలం, ఉత్సుకత! ఒకవైపు హేళన, ఇంకొకవైపు కుతూహలం. శాంత ఒక సారి మూర్తివైపు చూసింది. "భగవంతుడు ప్రేమించే స్త్రీకి ఇచ్చిన విశృంఖలత్వాన్ని పురుషు

డికి ఇవ్వలేదు కాబోలు. సౌందర్యం అనే ఆకర్షణ ముందర అల్పత్వంతో అట్లా చలించిపోతాడు'' అనుకుంది. ఏదో జాలి వేసింది. మూర్తిది అంతా చిన్నపిల్లాడి వరస అనుకుని నవ్వుకుంది. అంత లోనే ఏదో వూహ తోచింది. భారతివైపు తిరిగి ఒకసారి ఆ పుస్తక మిస్తారా ?'' అంది హిందీలో.

భారతికి ప్రశ్న తనను ఉద్దేశింపబడినదని తెలిసింది కాని అర్థం కాలేదు. ఈసారి శాంత ఇంగ్లీషులో అడిగింది. భారతి శాంతకు పుస్తకం యిచ్చింది మౌనంగా.

''మీకు హిందీ వచ్చనుకున్నాను'' అని శాంత ఇంగ్లీషులో అడిగినదానికి ''రాదండీ, ఇంగ్లీష్ కూడా ఫ్లూయన్సీతో మాట్లాడలేను'' అంది తెలుగులో స్పష్టంగా భారతి. చే రుమాలుతో క్రింద పెదవి తాకుతూ. భారతి సిగ్గుపడుతోందని శాంత గ్రహించింది.

'మీరు తెలుగువాళ్ళేనా? చదువుకుంటున్నారనుకుంటాను'' అంది.



ఒక పెప్స్‌ను చప్పరించి. నొప్పిని పోగొట్టుచూ గొంతు నొప్పిని, రొమ్ము పడిశెమును, దగు లేక జలుబును కలిగించే క్రిములను చంపునట్టి చర్యను జరిపే అందలి శమనకర ఆవిరులను ఆస్వాదించండి. పెప్స్ తక్షణ శమనమును శీఘ్రనివారణను గలిగించును.


ఇందులో హానికర ఓషధులు లేవు పిల్లలకు సురక్షితంగా ఇవ్వవచ్చును.
రొమ్ము పడిశెములు, గొంతు నొప్పి, పడిశెము, అధిక కఫము జలుబులు, దగ్గులను త్వరితంగా నివారించును
మందుల వ్యాపారులందరివద్ద అమ్మబడుచున్నవి
ఏ. జ ఫల్‌షార్డ్ (ఇండియా) ప్రైవేట్ లి
FPY.55 TEL

సోల్ ఏజంట్స్. దాదా అండ్ కో.,
36, నైనియప్ప నాయక్ వీధి, మద్రాసు-3

ఔనండీ. మాది రాజమండ్రి దగ్గిర చిన్న వూరు. గుంటూరు విమెన్స్ కాలేజి ఫస్ట్ యియర్ చదువుతున్నాను.''

''అంత దూరం. . . .''

''ఔను. విమెన్స్ కాలేజి, హాస్టలు ఉందని. పండగలకి మా వూరు వెళ్లి వస్తున్నాను. మీరూ ఏమైనా చదువుతున్నారా ?''

శాంత చెప్పింది మందహాసంతో: ఔనండీ లిటరేచర్ ఆనర్స్ ఫోర్త్ యియర్. మా అన్నయ్యకి పెళ్లి సంబంధము చూడటానికి గుంటూరు వెడుతున్నాము.''

ఇద్దరి పరిచయం ఇంతవరకూ వస్తుందని మూర్తి అనుకోలేదు. శాంత మాటలు విని అతడు కళవళపడ్డాడు. శాంత మాటలు విని భారతి మూర్తివైపు ఒకసారి చూసి తనలో తను నవ్వుకుంది.

శాంత చిరునవ్వుతో ''మా అన్నయ్యకి చదువుకుని ఫాషనబుల్ గాఉండే అమ్మాయి అంటే ఇష్టం. పెళ్లిచూపు లంటే ఏదో పేరుకే కాని ఒకరి ఇష్టాయిష్టాలు మరొకరికి తెలియటానికి అవకాశం ఉండదు. ఈసారైనా పెళ్లికూతురి సెలక్షన్‌లో మా అన్నయ్య పొరపడకూడదని నేను కూడా వెడుతున్నాను. ఇంటి కల్చర్ ఎటువంటిదో అర్థం చేసుకోవటం మనకి తేలిక చూడండి!''

ఔను'' పెదిమలు కదలకుండా మెల్లిగా చిరునవ్వుతో అంది భారతి.

''క్షమించండి. మీ. పేరు తెలుసుకోవాలని ఉంది.''

''భారతి''. ''నా కా పేరు చాలా యిష్టం'' అని శాంత అంటే భారతి చేతికి చేరుమాలు అడ్డం పెట్టుకుని మందహాసం చేసింది.

''మీరు హాస్టల్‌లోనే ఉన్నారనుకుంటాను.''

''ఔను. మీల్స్ పడలేదు కాని, మరి చదువు కావాలనుకుంటే ఏం చేస్తాం. స్వతంత్రంగా బ్రతకగలిగి ఉండాలని మా అమ్మ అభిప్రాయం. అమ్మ ప్రోత్సాహం లేకపోతే ఇంతదూరం వచ్చి ఒంటరిగా చదువుకోడానికి నాకు ధైర్యం ఉండేదికాదు.''

''ఔను, మా అన్నయ్య కూడా అట్లాగే అంటాడు. ఎంతమందిని చూసినా మా అన్నయ్యకి నచ్చదు. మరీ మాడరన్‌గా ఉండాలంటాడు. అసలు మా బంధువు అమ్మాయితో పెళ్లి నిశ్చయమైంది కూడాను. నాకు వరసకు వదిన అవుతుంది. పేరు నిర్మల. చూపులకి అన్నయ్యతో నేనుకూడా వెళ్లాను. వాళ్లు కూడా చాలా కలిసి మెలసి ఉండే స్వభావం చదువుకుని సోషల్‌గా ఉంటారు. నిర్మలను చూడగానే బాగుంటుందని పెళ్లికి ఒప్పుకున్నాడు మా అన్నయ్య. కాని తరువాత ఇద్దరి అభిప్రాయాలూ వేరయ్యాయి.''

ఈసారి భారతి ఆశ్చర్యంగా చూసింది శాంత వేపు. శాంత చిరునవ్వుతో ''ఉహు ఆ పెళ్లి కాలేదు. నిర్మల చక్కనిది; చదువుకుంది. కుసుమంలాగ మెత్తనిదే కాని తన అభిప్రాయా లేవో తనవే మార్చుకోలేదు. వాళ్లు మాకు బంధువులని వాళ్లింట్లోనే దిగాము. ఆరోజునే గాలివాన ప్రారంభించింది. వాళ్లు మమ్మల్ని కదలనీయలేదు. పెళ్లి నిశ్చయమయినట్లే. నిర్మల అన్నయ్యతో మాట్లాడేది. గాలివాన రెండురోజు లుంది. ఇంక ఇంటికి వెడదామనుకుంటుంటే నాకు విపరీతమైన తల నొప్పి వచ్చింది. ఆ రాత్రికే పెద్ద జ్వరం. మా ప్రయాణం మళ్లీ ఆగిపోయింది. నిర్మలతో బాగా స్నేహం ఏర్పడింది. నేను ఆ రోజు పథ్యం తీసుకున్నాను. పడుకుని ఏదో పత్రిక చూస్తున్నాను. నిర్మల అక్కడే నిలబడి జడ అల్లుకుంటోంది. తలంటి పోసుకుంది. నల్లని పొడవైన కురులు. కొత్తది తెల్లచీర కట్టుకుంది. ముఖంలో అదొక కళ కనిపించింది. ''ఇవేళ ఏదో విశేషం ఉన్నట్టుంది నిన్ను చూస్తుంటే'' అన్నాను.

''ఇవేళ నా పుట్టిన రోజు'' అంది నిర్మల.

ఆ మధ్యాహ్నం రకరకాల ఫలహారాలు చేసి చిన్న టీపార్టీ చేశారు.

''నిర్మల కేమైనా కానుక ఇవ్వాలి అన్నయ్యా! ఏమి వస్తువు బాగుంటుంది ?'' అన్నాను.

''నాకు తెలుసులే'' అని అన్నయ్య బజారుకి వెళ్లాడు. ఏభై రూపాయలు ఖర్చుచేసి ఒక చీర, బ్లేడ్, టాయ్‌లెట్ సెట్ ఒకటి, ముత్యాల గాజులు చెవులకు తెచ్చాడు. అన్నీ చాలా చక్కగా ఉన్నాయి.

''త్వరగా అన్నీ ధరించి రావాలని చెప్పు. కెమెరా రెడీగా ఉంచుతున్నాను'' అన్నాడు.

''ఇదిగో ఇంజనీర్‌గారి భార్య ఇవన్నీ ధరించాలట. అన్నయ్య ఫోటో తీస్తాడట. త్వరగా తయారవు'' అన్నాను, ఒక్కొక్కటే తీస్తూ.

ప్రింటెడ్ జార్జెట్ చీర, దానిమీదికి సరిపోయే రంగుతో వెనక గుండీలున్న బోట్ నెక్ జాకెట్. టాయిలెట్ సెట్‌తో, లిప్‌స్టిక్‌తోడ్, చెంపల్ని తాకుతాయేమో నన్నంత పెద్ద దిద్దులు. అన్నింటి మీద నిర్మల చూపులు కొంచెంసేపు నాట్యం చేశాయి.

''త్వరగా కానీ'' అన్నాను. నిర్మల పెదవి చివరలు కొలది కొలదిగా కదలి ఒక చిరునవ్వు వెలువడింది.

''అవి నే నిప్పుడు వేసుకోను'' అంది నిశ్చలంగా

నేను వెళ్లి అన్నయ్యతో చెప్పాను. అన్నయ్య వచ్చి అడిగాడు.

''ఉహు. నే నిప్పుడు వేసుకోను'' అంది. అన్నయ్య బాలా చిన్నబుచ్చుకున్నాడు.

''మీ అన్నయ్య నేమీ అనుకోవద్దను శాంతా! నాకు ఎవరైనా అలాంటివి వేసుకుంటే చూడటానికి యిష్టంగా ఉంటుంది కాని, నేను వేసుకోవటం ఇష్టం ఉండదు. వేసుకోలేను కూడాను. నాకు సింపుల్‌గా ఉండటమే ఎంతో యిష్టం'' అంది.

''అన్నయ్యకు అటువంటివన్నీ నచ్చదా'' అన్నాను విచారంగా.



# నీటి దరిని...

— శ్రీ శ్రీపాద వెంకన్న

ఇంటికి వచ్చిన అన్నయ్య అమ్మతో అన్నాడు:

"అన్నీ బాగున్నాయమ్మా కానీ, నా సరదా తీర్చలే దా అమ్మాయి. రేపు నా మాట వింటుందని నాకేం నమ్మకంలేదు" అన్నాడు. అంతే, పెళ్లి ఆగిపోయింది.

ఇష్టాలు వేరయితే ఆ వివాహంలో ఆనందం ఉండదు" అని కథ ముగించినట్లు నవ్వింది శాంత.

"ఐనా హిందూదేశంలో రకరకాల సంస్కృతు లున్నాయి. భాషాదులలో లాగే వేషంలో కూడా కొంచెం విశాల దృక్పథం అలవరచుకోవాలి మన తెలుగువాళ్లు. నిజమే ఉత్తరాది వాళ్లలో ఉండే సౌందర్య పోషణలో ఆసక్తి మన తెలుగు వాళ్లలో కనుపించదు. ఇప్పుడు మన వాళ్లలో కూడా ఆ ఛాయలు సోకుతున్నాయి. ఇది ఒక శుభ సూచనే అని నా ఉద్దేశం. మీ రేమంటారు ?" అంది.

భారతి సన్నగా నవ్వుతూ కనుబొమలు చిట్లించి "అబ్బ! ఆ సంగతి ఎట్లాఉన్నా రైలు ఎక్కింది మొదలుకొని అందరి చూపులు నామీదే. ఈ వేషం ఎందుకు వేసుకున్నానా అని ఇప్పుడు బాధగా ఉంది. మనవాళ్లకి ఇంకా అంత సంస్కృతి రాలేదు" అంది.

శాంత "పోనీ లేడీస్ కంపార్ట్‌మెంట్‌లో కూర్చో లేక పోయారా" ? అంది.

"అక్కడ అసలు కాళీ దొరకదు. ఇక్కడైతే కొంచెం ఆడవాళ్లకి చోటుఇస్తారు,వాళ్ల చోటైనా వదులుకొని. అక్కడ మన నెవరు గౌరవిస్తారని' అక్కడ ఎక్కితే నేనెక్కిన చోట ఇద్దరు స్టూడెంట్స్ ఏడిపించటం మొదలుపెట్టారు. అందుకని ఏలూరులో ఈ కంపార్టుమెంటులోకి మారాను. మీ సాయం దొరికాక మనసు కొంచెం కుదుటపడింది. ప్రయాణంలో వేసుకోవటం ఇదే మొదటిసారి."

బెజవాడ వచ్చేదాక మూర్తి దీక్షగా పత్రిక చూస్తూ కూర్చున్నాడు. బెజవాడలో మూర్తి దిగి సామాను రిటైరింగ్ రూమ్‌కి తీసుకు వెడుతుంటే శాంత భారతికి పత్రిక అందించి గుడ్‌బై చెప్పింది.

"ఎంత చక్కని ముఖం. మెత్తని హాసం! ఆట్టే ధైర్యం కూడా లేదు. ఎందుకో ఆ బాల్య చాపల్యం!" అనుకుంటూ శాంత మూర్తి వెనక వెళ్లింది.

గుంటూరు బండికి వేళవుతోంది. కూలీలు సామాను తీసుకు వెడుతున్నారు. శాంత మూర్తిని ఆపుతూ భుజంమీద చేయివేసి, "చూడండి, ఆ అమ్మాయి కూడా గుంటూరే వెడుతుందట. ఏ కంపార్ట్‌మెంట్‌లో ఉందో వెతుకుదామా?" అంది.

"ఎందుకూ ?" అన్నాడు మూర్తి.

"ఏం ? ఒకగంట చూస్తూ కూర్చుంటే కాలక్షేప మయిపోతుంది" అంది శాంత నవ్వుతూ.

ముఖం చిన్నది చేసుకుని "అదేమిటి శాంతా కథ కల్పించావు. నన్ను నీ అన్నయ్య అనుకోడూ ఆ అమ్మాయి!" అన్నాడు.

"అనుకోనియ్యండి. మిమ్మల్ని మా అన్నయ్య అని నే నేమీ పరిచయం చెయ్యలేదు. అనుకో నివ్వండి. మీరు ఒక మంచి పెళ్లికొడుకని కూడా అనుకుంటుంది. తనేనా మీరు అన్వేషిస్తున్నటు వంటి పెళ్లికూతురు. ఎంత ఆనందంగా ఉంటుంది! మీరు పెళ్లిచూపులనాడు చేసిన అల్లరినే కథగా చెప్పాను. ఆ నిర్మల శాంతగా మారిపోయింది మీ కోసం కదూ!...."

"నాకోసం నీవు మారావా ? నీ కోసం నేను మారానా ?" అన్నాడు మూర్తి.

"నన్ను క్షమించండి. మీరు అంత కుతూహలం చూపే అమ్మాయి దగ్గర నేను మీ భార్యనని చెప్పుకోవటం నాకు సిగ్గువేసింది" అంది చటుక్కున తల వంచి నేల చూపులు చూస్తూ.

రైలు కదిలింది. చిన్న కంపార్ట్‌మెంట్. ఇంకెవ్వరూ లేరు. "నిన్ను నొప్పించాను శాంతా. నా మనసు నీకు తెలీదూ! నన్ను క్షమించు శాంతా!" అన్నాడు మూర్తి. శాంత చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుంటూ. శాంత స్నిగ్ధంగా నవ్వింది.

కృష్ణమీద నుంచి వచ్చే గాలి ఇద్దరి మనసులనూ చల్లగా తాకింది.